# బోడగుట్ట ఫుట్ ఓవర్ బ్రిడ్జికి మోక్షమెప్పుడో?

- కనుచూపు మేర పట్టణం.. చేరాలంటే ఐదు కిలోమీటర్లు
- రైలు పట్టాలు దాటడం.. దినదిన గండం..
- బోడగుట్ట కాలనీవాసుల కష్టాలు
- పాలకులు, రైల్వే అధికారులు పట్టించుకోవాలని వినతి


రైలు పట్టాల మీదుగా రాకపోకలు సాగిస్తున్న బోడగుట్ట వాసులు

కాజీపేట, ఫిబ్రవరి 24 : కాజీపేట పట్టణం 47వ డివిజన్ పరిధిలోని బోడగుట్టకు ప్రయాణం ఆ కాలనీవాసులకు ప్రాణ సంకటంగా మారింది. దాదాపు శతాబ్దం క్రితం రైల్వే కార్మిక కుటుంబాలతో ఏర్పాటైన బోడగుట్ట కాలనీవాసులకు కష్టాలు ఇప్పటికీ తీరడం లేదు. పాలకులు చొరవ తీసుకుని బోడగుట్టకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాజీపేటకు బోడగుట్ట కాలనీ మరో శ్రీలంకగా మారింది. రెండు వైపులా రైలు పట్టాలు, మరో వైపు గుట్ట, మరో దిక్కు చెరువు ఉంది. బోడగుట్ట కాలనీ కాజీపేటకు అతి సమీపంలో ఉండడంతో ఇండ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతూ కాలనీలు వెలుస్తున్నాయి. కాజీపేట కనుచూపు మేరలో ఉన్నా చుట్టు దాదాపు ఐదు కిలో మీటర్లు దూరం తిరిగి రావాల్సి వస్తోంది. ఇటు నాగుల్ చెరువు, కడిపికొండ ఆర్వోబీ, బాపూజీనగర్ చౌరస్తా మీదుగా అటు ఇందిరానగర్, దర్గా రైల్వే గేట్, దర్గా కాజీపేట, ఫాతిమానగర్, బ్రిడ్జి మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో రోజు ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ పనులపై నగరానికి వెళ్లే కాలనీవాసులు కాలినడకన రైలుపట్టాలు దాటి వెళ్తుంటారు. ఈ క్రమంలో ఏ క్షణాన ఏ రైలు ఏటు నుంచి వస్తుందోనని భయంభయంగా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. కాలనీవాసులు రైల్వే లైన్లు దాటే క్రమంలో అప్పుడప్పుడు ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలున్నాయి. 60 ఏండ్లుగా ఎన్నో ప్రభుత్వాలు, పాలకులు మారినా కాలనీవాసుల కష్టాలను తీర్చడంలో వారంతా విఫలమయ్యారు. గతంలోనే కాలనీ ప్రజలు కాజీపేట నుంచి బోడగుట్టకు రైలు పట్టాల మీదుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని పాలకులు, రైల్వే జీఎం, డీఆర్ఎం తదితర రైల్వే ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. రెండున్నరేళ్ల క్రితం పశ్చిమ ఎమ్మెల్యే, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ చొరవ తీసుకుని సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. గ్రేటర్ కార్పొరేషన్, ఎంపీ 50 శాతం నిధులను సమకూర్చితే, రైల్వే శాఖ 50 నిధులను కలిపి కాజీపేట–బోడగుట్టకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించేలా రైల్వే అధికారులతో ఒప్పందం చేయించారు. ప్రస్తుతం ప్రభుత్వం, పాలకులు మారడంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఒప్పందం కలగా మిగిలిపోయిందని, ఇప్పటి వరకు ఒక్క అడుగు ముందుకు వేయలేదని స్థానికులు చెబుతున్నారు. కాజీపేట–బోడగుట్టకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అయ్యేదెప్పుడో కాలనీ వాసుల తలరాతలు మారేదెప్పుడోనని దిగాలుచెందుతున్నారు. ఇప్పటికైనా ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని కాజీపేట–బోడగుట్టకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### పాలకులు, రైల్వే అధికారులు పట్టించుకోవాలి



కాజీపేట–బోడగుట్టకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడం వల్ల అధిక వ్యయ ప్రయాసలకు ఓర్చి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కాజీపేట చౌరస్తా నుంచి బోడగుట్టకు వెళ్లాలంటే కనీసం ఐదు కిలోమీటర్లు తిరిగి వెళ్తున్నాం. పాలకులు, రైల్వే అధికారులు మా బాధలను అర్థం చేసుకుని, ఫుట్ ఓవర్ బ్రిడ్జికి అనుమతితో పాటు నిధులను మంజూరు చేసి నిర్మించాలి.

– అఫ్జల్ పాషా, స్థానికుడు

### ఎంపీ, రైల్వే అధికారులతో చర్చించాలి



దాదాపు 60 ఏళ్లుగా మేము పడుతున్న బాధలు వర్ణణాతీతం. రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో కలుగుతున్న బాధలను పరిగణలోకి తీసుకుని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, రైల్వే ఉన్నతాధికారులతో చర్చించాలి. రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లిస్తే రైల్వేశాఖ కూడా స్పందించి తగినన్ని నిధులు మంజూరు చేయాలి. అప్పుడే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం సాధ్యమవుతుంది.

– చాంద్‌పాషా, స్థానికుడు

## కేడీసీలో విద్యార్థుల ఆందోళన

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 24: హనుమకొండలోని కేడీసీలో విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. విద్యార్థి శివపై పెట్టిన అక్రమ కేసును వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తరగతులను బహిష్కరించి, కాలేజీ ఎదుట బైఠాయించి యూనివర్సిటీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 15 రోజుల్లో శివపై ఉన్న కేసులను కొట్టివేయకపోతే వేయి మందితో కేయూను ముట్టడిస్తామని హెచ్చరించారు.

## ఇంపీరియల్ కాలనీలో చోరీ

కాజీపేట, ఫిబ్రవరి 24 : తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బంగారు వస్తువులను అపహరించిన ఘటన కాజీపేట ఇంపీరియల్ కాలనీలో సోమవారం రాత్రి వెలుగు చూసింది. కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఇంపీరియల్ కాలనీకి చెందిన అడ్డగూడి సతీశ్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో ఈ నెల 20న గోవా టూర్‌కు వెళ్లాడు. సోమవారం సాయంత్రం ఇంటికి చేరుకోవడంతో తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని పిల్లల చిన్న బంగారం ఉంగరాలు, చెవి కమ్మలు, వెండి వస్తువులను ఎత్తుకపోయారని వాటి విలువ దాదాపు రూ.60వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ నెల 21న రాత్రి దొంగతనం జరిగినట్లు పేర్కొన్నారు. బాధితుడు సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## షెడ్స్ నిర్మించుకోవాలి

దామెర, ఫిబ్రవరి 24 : పశువుల కోసం రైతులు షెడ్స్ నిర్మించుకోవాలని ఎంపీడీవో గజ్జెల విమల సూచించారు. మండల కేంద్రంలో రైతులకు షెడ్స్ నిర్మాణంపై సోమవారం అవగాహన కల్పించి, శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో మాట్లాడుతూ లబ్ధిదారులు వచ్చే నెల 15లోపు షెడ్స్ నిర్మించుకోవాలన్నారు. నిర్మాణంలో తీసుకోవాల్సిన చర్యలు, కొలతలను వివరించారు. కార్యక్రమంలో ఏపీవో శారద, టీఏ సురేందర్, ఎఫ్ఏ సారంగపాణి పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న రైతు రవి

## రైతు ఆత్మహత్యాయత్నం

నడికూడ, ఫిబ్రవరి24: మండలంలోని ధర్మారంలో రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పరకాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని రైతు భాషిక రవి వ్యవసాయ భూమి పక్కన ఉన్న ఇసంపల్లి చంద్రయ్య, దయాకర్, వినాయకర్ కలిసి మీ భూమిలో మా జాగ కలిసిందని రెండేళ్లుగా భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇష్టం వచ్చినట్లు తిడుతూ భూమిని ఆక్రమించడం, ప్రైవేట్ సర్వేయర్లను డబ్బుతో కొని భూమి కొలిపిస్తూ గెట్టు పెట్టారు. సోమవారం సర్వేయర్ లక్ష్మీప్రసన్నను కూడా డబ్బుతో కొని భూమిలో రాళ్లు పాతేందుకు యత్నించగా భాషిక రవి వారి కాళ్లు మొక్కి వేడుకున్నా కూడా వినలేదు. బెదిరిస్తూ రాళ్లు పాతేందుకు ప్రయత్నించారు. ఈ బాధను తట్టుకోలేక పొలం దగ్గర ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. ఇసంపల్లి చంద్రయ్య, దయాకర్, వినాయకర్, ప్రైవేటు సర్వేయర్ పాలడుగు రమేశ్, సర్వేయర్ దేవరకొండ లక్ష్మీప్రసన్నపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రవి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## 62 కిలోల ఎండు గంజాయి పట్టివేత


గంజాయి, నిందితులతో పోలీసులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 24 : పోలీసులు తనిఖీల్లో 62 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు. మండలంలోని గూడెప్పాడ్ స్టేజీ వద్ద సోమవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో కనపడినట్లు పేర్కొన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారు ఒడిశా రాష్ట్రానికి చెందిన కన్ను జాన్(22), అలోక్ ప్రధాన్(22), మంగు ప్రధాన్(38)గా గుర్తించినట్లు తెలిపారు. వారి వద్ద బ్యాగుల్లో 62 కిలోల ఎండు గంజాయి ఉందని, దాని విలువ సుమారు రూ.31లక్షలు ఉంటుందని తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేసినట్లు వివరించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టేకు చెట్ల నరికివేతకు యత్నం

### అటవీశాఖ అధికారికి ఫిర్యాదు చేసిన బాధిత రైతు

సుబేదారి, ఫిబ్రవరి 24 : రైతు పట్టా భూమిలో పెంచుకున్న టేకు చెట్లను సొంతం చేసుకోవడానికి ఇద్దరు వ్యక్తులు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. బాధిత రైతు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు ఫిర్యాదు ప్రకారం భీమదేవరపల్లి మండలం ములకనూరుకు చెందిన అలిగిరెడ్డి సతీశ్‌కుమార్‌రెడ్డి గ్రామంలోని తన పట్టా భూమి మామిడి తోట చుట్టూ వంద టేకు చెట్లు పెంచాడు. చెట్లు ఏపుగా పెరుగడంతో ములుకనూరుకు చెందిన సామిల్స్ లీజ్ తీసుకొని నడుపుతున్న ప్రకాశం, గట్ల నరిసింగపూర్‌కు చెందిన నాగరాజు వాటిని నరికివేయడానికి ఎల్కతుర్తి అటవీ శాఖ రేంజ్ పరిధిలో పని చేస్తున్న ఓ అధికారితో 50 చెట్లకు నంబర్లు వేశారు. ఇది గమనించి భూమి యజమాని సతీశ్‌కుమార్‌రెడ్డి సోమవారం హనుమకొండ అటవీశాఖ అధికారికి ఫిర్యాదు చేశాడు. తన పట్టా భూమిలో పెంచుకున్న టేకు చెట్లను అక్రమంగా నరికివేయడానికి యత్నించిన ప్రకాశం, నాగరాజు, వారికి సపోర్ట్ చేసిన సెక్షన్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి

పరకాల/కమలాపూర్, ఫిబ్రవరి 24 : విద్యార్థులు పరీక్షల భయాన్ని విడిచి, చదువుపై దృష్టి పెట్టాలని ఆర్డీవో డాక్టర్ కే నారాయణ సూచించారు. మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(ఆత్మకూరు)లో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని సూచించారు. ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, ఎంఈవో రమాదేవి, తహసీల్దార్ విజయలక్ష్మి, హెచ్ఎం చక్రవర్తుల మధు పాల్గొన్నారు. అలాగే, కమలాపూర్‌లోని జ్యోతిబాపూలే బీసీ బాలుర విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు ఎంఈవో కే శ్రీధర్ అవగాహన కల్పించారు. ఎంజేపీ ప్రిన్సిపాల్ రవీందర్, ఉపాధ్యాయులు విష్ణుమూర్తి, భూమలింగం, పండరి వాసు, శివశంకర్, శ్రీనివాస్, రమేశ్, నర్సింగరావు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు


పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీసీపీ

పరకాల, ఫిబ్రవరి 24 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. పట్టణంలోని 27వ పోలింగ్ స్టేషన్, నడికూడ మండలంలోని 29వ పోలింగ్ స్టేషన్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బందోబస్తు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీఐ కాంత్రికుమార్‌కు వివరించారు. ఉపాధ్యాయ ఓటర్ల వివరాలను ఆయా మండలాల తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## కాంట్రాక్టు అధ్యాపకులుగా అవకాశం కల్పించాలి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 24 : కేయూలో ఫుల్ వర్క్‌లోడ్‌తో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులకు కాంట్రాక్టు అధ్యాపకులుగా అవకాశం కల్పించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రాన్ని పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై రాంబాబు కోరారు. పదేళ్లుగా ఎలాంటి పదోన్నతి లేకుండా పనిచేస్తున్నారని, రాబోయే పాలకమండలి సమావేశంలో పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్ట్ టైం అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేంద్రనాయక్ డాక్టర్ శేషు, దేవోజీనాయక్, సంజీవ్, లక్ష్మీనారాయణ, శ్రీధర్, స్వామిచరణ్, ఎడ్ల ప్రభాకర్, శంకర్ పాల్గొన్నారు.

## 'కేయూకు రూ.500 కోట్లు విడుదల చేయాలి'

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 24 : రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో విద్యారంగానికి కనీసం 20 శాతం శాతం బడ్జెట్‌ని కేటాయించాలని, కేయూ అభివృద్ధికి రూ.500 కోట్లు విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు మర్రి మహేశ్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అరకొర నిధులను కేటాయించి, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా విద్యాశాఖ మంత్రి నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో నాయకులు రతీశ్, అశోక్, విష్ణు, రవి, మాధవ్, సంతోషం, సందీప్ పాల్గొన్నారు.

## రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి : కలెక్టర్ ప్రావీణ్య


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్, ఫిబ్రవరి 24 : పవిత్ర రంజాన్ మాసానికి సంబంధించి ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో ఆమె రంజాన్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో మాదిరిగానే రంజాన్ మాసానికి ఏర్పాట్లు చేయాలన్నారు. మార్చి 2 నాటికి ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు. మసీదుల వద్ద తాగునీటి సౌకర్యాన్ని కార్పొరేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. మసీదులను విద్యుత్‌దీపాలతో అలంకరించాలన్నారు. ముస్లిం ఉద్యోగులకు గంట ముందు వెళ్లేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్నాయన్నారు. శుక్రవారం మసీదుల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు తమ పరిధిలోని మసీదుల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలోని మసీదుల వద్ద రంజాన్ మాసానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీవోలు రమేశ్ రాథోడ్, నారాయణ, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మురళీధర్‌రెడ్డి, డీపీవో లక్ష్మీ రమాకాంత్ పాల్గొన్నారు.

### 27న మద్యం షాపులు బంద్

వరంగల్, ఖమ్మం, నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 27న జిల్లా వ్యాప్తంగా మద్యం షాపులు, బార్లు, కల్లు దుకాణాలు, కల్లు డిపోలు మూసివేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు 25వ తేదీ సాయంత్రం నుంచి 27 సాయంత్రం 4 గంటల వరకు మద్యం, కల్లు దుకాణాలు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం షాపులను తెరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

## ఎన్నిసార్లు విన్నవించాలి?

- బల్దియా గ్రీవెన్స్‌పై నగరవాసుల పెదవి విరుపు
- అధికారులు స్పందించడం లేదని ఆవేదన


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్, ఫిబ్రవరి 24 : బల్దియా గ్రీవెన్స్‌లో సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో మళ్లీ మళ్లీ అవే సమస్యలపై వినతులు వస్తున్నాయి. అనేక సార్లు వినతులు, ఫిర్యాదులు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక సమస్యపై పదుల సార్లు వినతులు ఇచ్చినా స్పందించడం లేదని గ్రీవెన్స్‌పై పెదవి విరుస్తున్నారు. విషయాన్ని పలువురు బాధితులు సోమవారం కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే దృష్టికి తీసుకొచ్చారు. కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో ఆమె గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. లక్ష్మీగణపతి కాలనీలో రోడ్డును అక్రమించిన వ్యక్తిపై గత గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మడికొండలోని మెర్సీ స్క్రాప్ షాపు నుంచి దుర్వాసన, పురుగులు చుట్టుపక్కల నివాసాల్లోకి వస్తున్నాయని, చర్యలు తీసుకోవాలని పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాలనీవాసులు తెలిపారు. 2వ డివిజన్ విజయలక్ష్మి కాలనీలో స్ట్రీట్ లైట్లు, డ్రైనేజీ, సీసీ రోడ్డు వసతి కల్పించాలని కాలనీవాసులు కోరారు. 59వ డివిజన్ ఎక్సైజ్ కాలనీ ఆర్చీ వద్ద నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మిస్తున్నారని, దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ గుజ్జుల వసంత ఫిర్యాదు చేశారు. ప్రగతినగర్ కాలనీలో రహదారికి అడ్డంగా ఉన్న పిల్లర్‌ను తొలగించాలని ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదని కాలనీవాసులు కమిషనర్‌కు విన్నవించారు. 48వ డివిజన్ దర్గా కాజీపేట మార్కేండేయ వీధిలో సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, వెంటనే నిర్మించాలని కాలనీవాసులు కోరారు. అలాగే, రోడ్డు మధ్యలోని విద్యుత్ స్తంభం తొలగించాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు స్పందించడం లేదని వాపోయారు. అనంతరం కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ గ్రీవెన్స్ వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 65 వినతులు రాగా, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 33, ఇంజినీరింగ్ విభాగం 13 , ప్రజారోగ్య విభాగం 8, పన్నుల విభాగం 10, తాగునీటి సరఫరా ఒకటి వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, బయలాజిస్ట్ మాధవరెడ్డి, హెచ్‌వో రమేశ్, లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్రరాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, పన్నుల అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

## ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్-2 డిపో కమిటీ ఎన్నిక

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 24 : ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్–2 డిపో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భాషబోయిన కుమారస్వా మి, సెక్రటరీగా వైనాల బిక్షపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొలనకొండ వేణు, ప్రధాన కార్యదర్శి మాదారపు సాంబయ్య ఆధ్వర్యంలో పబ్లిక్‌గార్డెన్‌లో సోమవారం ఎన్నికలు నిర్వహించారు. డిపో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రావుల రామ, సందుల రాధిక, ఉపాధ్యక్షులుగా ఆర్ సారంగపాణి, గొల్ల స్వామి, డిపో గ్యారేజీ సెక్రటరీగా ఆర్ఎన్ రావు, జాయింట్ సెక్రటరీగా కుక్కునూతుల వేణుగోపాల్, గోలి వేణుగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గుర్రపు వరలక్ష్మి ఎన్నికైనట్లు వేణు, సాంబయ్య తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాత్రి దుర్గయ్య, జిల్లా కమిటీ చీఫ్ అడ్వైజర్ ఎంఎస్ రావు పాల్గొన్నారు.

## నేటి నుంచి మహాశివరాత్రి మహోత్సవాలు


ఐనవోలు: సూర్యప్రభ వాహనసేవలో స్వామి వారు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 24 : చారిత్రక వేయిస్తంభాల దేవాలయంలో మంగళవారం నుంచి మార్చి 1 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. సోమవారం ఆలయంలోని కుడా మైదానంలో నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో అనిల్‌కుమార్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు గట్టు మహేశ్‌బాబు, రుద్రేశ్వర సేవాసమితి సీనియర్ నాయకులు రావుల సుదర్శన్, చొల్లేటి కృష్ణామాచారి, అర్చకులు ప్రణవ్, సిబ్బంది రామకృష్ణ, రంజిత్ పాల్గొన్నారు.

**మెట్టుగుట్టపై..**

మడికొండ : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు మడికొండ మెట్టుగుట్టపై ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మెట్టుగుట్ట శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, ఈవో శేషుభారతి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సెంట్రల్ జోన్ డీసీపీ సలీమాతో కలిసి వారు మాట్లాడుతూ జాగరణ భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, అన్నదాన నిర్వాహకుడు మాడిశెట్టి రాజేశ్‌కుమార్, ధర్మకర్త బైరి రాజు పాల్గొన్నారు.

**ఐనవోలులో బ్రహ్మోత్సవాలు షురూ..**

ఐనవోలు : ఐనవోలు మల్లికార్జునస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వేకు జాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సూర్య ప్రభ వాహనసేవపై ఊరేగించారు. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, సీఐ రాజగోపాల్, ఎస్సై పస్తం శ్రీనివాస్, అర్చకులు మధుకర్‌శర్మ, పాతర్లపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.


హనుమకొండ చౌరస్తా : వేయిస్తంభాల గుడి వద్ద మాట్లాడుతున్న గంగు ఉపేంద్రశర్మ, ఇన్‌చార్జి ఈవో అనిల్‌కుమార్


మడికొండ : సమావేశంలో మాట్లాడుతున్న మెట్టుగుట్ట శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్


రాంపూర్ డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న గుండు సుధారాణి

## కాలుష్య నియంత్రణకు చర్యలు

### మేయర్ గుండు సుధారాణి

వరంగల్, ఫిబ్రవరి 24 : రాంపూర్‌లోని డంపింగ్ యార్డు నుంచి వెలువడే పొగ, కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం ఆమె రాంపూర్ డంపింగ్ యార్డును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ త్వరలో హుజూరాబాద్ సమీపంలోని సిర్సపల్లిలో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. డంపింగ్ యార్డుకు చెత్త తరలింపు తగ్గించేందుకు ఆరు బయో కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డంపింగ్ యార్డు చుట్టూ 10 మీటర్ల ఎత్తు ప్రహరీతో పాటు ప్లాంటేషన్ చేపట్టనున్నట్లు తెలిపారు. బయోమైనింగ్ ద్వారా వచ్చే వర్థ్యాలను వెంటనే తరలిస్తామన్నారు. వరంగల్‌లోని లక్ష్మీపురం, హనుమకొండలోని బాలసముద్రం, కాజీపేట మార్కెట్‌లో బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేసి, మార్కెట్‌లోని ఆహార వ్యర్థ్యాలు బయటికి వెళ్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు డివిజన్ల వారీగా డీ సెంట్రల్ విండ్రో కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి, ప్రజలు సహకరించాలని కోరారు.

## బాలల సంరక్షణ కేంద్రాలు కనీస ప్రమాణాలు పాటించాలి

వరంగల్, ఫిబ్రవరి 24 : బాలల సంరక్షణ కేంద్రాలు( చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్) కనీస ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఇన్‌స్పెక్షన్ కమిటీ, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి వసతి, భోజనం, విద్య, వైద్యంతో పాటు కనీస వసతులు కల్పించాలన్నారు. ఈ నెల 27 నుంచి మార్చి 5 వరకు జిల్లాలోని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను ఏడుగురు సభ్యుల బృందం తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైల్డ్ వేల్ఫేర్ కమిటీ సభ్యులు రాజేంద్రప్రసాద్, దామోదర్, బాలరక్షా భవన్ కోఆర్డినేటర్ అవంతి, బాలల పరిరక్షణ ఇన్‌చార్జి అధికారి ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ అధికారి మౌనిక, డెమో అశోక్‌రెడ్డి, డాక్టర్ ఇఫ్తాకర్ హమీద్, శిశు, గృహ ఇన్‌చార్జి మేనేజర్ మాధవి, డాక్టర్ వేణుగోపాల్, జిల్లా తనిఖీ బృందం సభ్యులు ఎర్ర శ్రీకాంత్, జెస్సీ సిరియాక్, సోషల్ వర్కర్లు విజయ్, చైతన్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


రమేశ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

## బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా

### పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

దామెర, ఫిబ్రవరి 24 : బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని ఒగులాపురం బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కిన్నెర రమేశ్ అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సోమవారం అతడిని పరామర్శించారు. రమేశ్ ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, బీఆర్ఎస్ కార్యకర్తలు, వారి కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము, నాయకులు శివ, కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, పుల్యాల రఘుపతిరెడ్డి, దుబాసి నవీన్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ భగవాన్‌రెడ్డి

## ఆర్బిట్ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 24 : చుక్కారామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన 15వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ 2024–25లో ఎల్లాపూర్ శివారులోని ఆర్బిట్ ఈ–టెక్నో పాఠశాల విద్యార్థులు పాల్గొని రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పవన్ మొదటి ర్యాంకు, సంజన రెండో ర్యాంక్, అశ్విని మూడో ర్యాంక్, రేవంత్, నాగశివాజీ, నిహారిక, సుచిత, అజయ్, సహస్ర టాప్ టెన్ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వీరు ఆదివారం ఓయూలో రూ.5116 నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందుకున్నట్లు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను సోమవారం కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్‌రెడ్డి, డైరెక్టర్ హరికారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

## మండల స్థాయి ప్రతిభా పోటీలు

నడికూడ, ఫిబ్రవరి 24 : మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించినట్లు ఎంఈవో హన్మంతరావు తెలిపారు. పోటీల్లో నడికూడ, రాయపర్తి కాంప్లెక్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ నాగరాజు, ఏవో జైసింగ్, ఎంపీడీవో చేతన్ కుమార్‌రెడ్డి, సీఐ క్రాంతి కుమార్, స్రవంతి విజేతలకు బహుమతులు అందజేశారు.


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్, ఫిబ్రవరి 24 : కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీవీ రాజు, పీ గోపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఐలయ్య, డెస్క్ జర్నలిస్ట్ ఫోరం ఉమ్మడి జిల్లా నాయకులు సోమనర్సయ్య, అశోక్, రఘుపతి, మండ రాజేశ్, ఇసంపల్లి రమేశ్, సుమన్, అకేశ్వరపు రాజేందర్, సంపత్‌రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, అభిషేక్ పాల్గొన్నారు.